క్లుప్తంగా

సర్వేలు వేగవంతం కావాలి



సచివాలయంలో సెక్రటరీలతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: పథకాలకు సంబంధించి సర్వేలు వేగవంతం చేయాలని జీవీఎంసీ జోన్‌–4 కమిషనర్‌ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన జోనల్‌ పరిధిలో సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్రటరీలు పి–4, వర్క్‌ ఫ్రం హోమ్‌ వంటి సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పరిశీలించారు. సమయానికి విధులకు హాజరవ్వాలన్నారు. అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఎటువంటి దరఖాస్తులు వచ్చినా వెంటనే జెడ్సీ లేదా సంబంధిత అధికారులకు పంపించాలన్నారు.

ఫుడ్‌ కమిషన్‌ సభ్యురాలి సుడిగాలి పర్యటన



పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న సభ్యురాలు గంజిమాల దేవి

మహారాణిపేట: రాష్ట్ర ఫుడ్‌ కమిషన్‌ సభ్యురాలు గంజిమాల దేవి బుధవారం పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇసుకతోటలోని బీసీ కాలేజీ గరల్స్‌ హాస్టల్‌, ఎంవీపీ కాలనీలోని ఎస్టీ వెల్ఫేర్‌ పోస్ట్‌ మాట్రిక్‌ కాలేజీ గరల్స్‌ హాస్టల్‌, సోషల్‌ వెల్ఫేర్‌ బాయ్స్‌ హాస్టళ్లను సందర్శించారు. ఇక్కడ పలు సమస్యలు ఉన్నట్టు విద్యార్థులు సభ్యురాలి దృష్టికి తీసుకొచ్చారు. కుళాయి కనెక్షన్‌ ఉన్నా.. నీరు రాకపోవడంతో ఈ విషయాన్ని జాయింట్‌ కలెక్టర్‌ దృష్టికి గంజిమాల దేవి తీసుకెళ్లారు. నాతయ్యపాలెంలోని రేషన్‌ షాపులో పీడీఎస్‌ సరకులను ఆమె పరిశీలించారు. అగనంపూడి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం రుచి చూశారు.

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె



ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

సీతమ్మధార: యునైటెడ్‌ ఫోరం ఆఫ్‌ బ్యాంక్‌ యూనియన్‌ పిలుపు మేరకు బుధవారం ద్వారకానగర్‌లో గల ఇండియన్‌ బ్యాంక్‌ జోనల్‌ ఆఫీస్‌ వద్ద ఆఫీసర్లు, క్లర్కులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌ నాయకులు మాట్లాడుతూ 24, 25 తేదీల్లో బ్యాంకులు సమ్మెకు వెళ్తున్నాయని గుర్తు చేశారు. ముఖ్యమైన డిమాండ్లు, ఐదు రోజుల పని దినాలు, బ్యాంకుల్లో నియామకాలు తదితర అంశాలు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ముఖ్య నాయకులు ఆఫీసర్స్‌ యూనియన్‌ కార్యదర్శి శివప్రసాద్‌, అవార్డు స్టాఫ్‌ యూనియన్‌ జాయింట్‌ జనరల్‌ సెక్రటరీ బి.మహేశ్వరరావు, అధిక సంఖ్యలో బ్యాంకుల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: మహారాణిపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో వెంకటేశ్వర థియేటర్‌ ఎదురుగా సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మంగళవారం ఉదయం మరణించి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా చనిపోయిన వ్యక్తి మెరూన్‌ కలర్‌ టీషర్టుపై బ్లూ అండ్‌ వైట్‌ కలర్‌ చెక్స్‌ షర్టు, డార్క్‌ బ్లూ కలర్‌ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌ మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 9440796010 నంబర్‌కు గాని మహారాణిపేట పోలీస్‌ స్టేషన్‌లో గాని సంప్రదించాలని కోరారు.

భవిత కోరుతూ.. యువత పోరు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పార్టీ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తదితరులు



35వ వార్డు నాయకుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనపై మండిపాటు

దాబాగార్డెన్స్‌: రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో యువత తరపున వైఎస్సార్‌సీపీ బుధవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పోటెత్తారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ నేతృత్వంలో నియోజకవర్గం అన్ని వార్డుల నుంచి పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పోరుబాట పట్టారు. నియోజకవర్గ పరిధి జిల్లా పరిషత్‌ జంక్షన్‌ నుంచి కలెక్టర్‌ కార్యాలయం వరకు సాగిన పోరుబాటలో వీరంతా యువత తరఫున పాల్గొన్నారు. బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, మెడికల్‌ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.. నిరుద్యోగ భృతి.. అంతా భ్రాంతి.. వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి.. అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు మహానేత వై.ఎస్‌. రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. యువతకిచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కక్షపూరిత **రాజకీయాలు విడనాడి** యువతకు ఉద్యోగావకా**శాలు, ఇచ్చిన హామీలు** అమలు చేయాలన్నారు. **కార్యక్రమంలో** కార్పొరేటర్లు బిపిన్‌కుమార్‌ జైన్‌, తోట పద్మావతి, చెన్నా జానకీరామ్‌, మాసిపోగు మేరీజోన్స్‌, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్‌, దొడ్డి బాపూ ఆనంద్‌, పలు వార్డుల నాయకులు పీతల వాసు, ముజీబ్‌ఖాన్‌, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బంగారమ్మ, బీసీ సెల్‌ అధ్యక్షుడు వెంకటరమణ, మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు షకీల్‌, సోషల్‌ మీడియా అధ్యక్షుడు బెవర మహేష్‌, ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు ఆకుల శ్యామ్‌కుమార్‌, కనకల ఈశ్వర్‌, కోరాడ సురేష్‌, బుల్లెట్‌ రవి, లండా రమణ, లింగం శ్రీనివాస్‌, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్‌ జంక్షన్‌ వద్ద నిరసన తెలుపుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్‌, జాన్‌వెస్లీ తదితరులు

35వ వార్డులో..

జగదాంబ: వైఎస్సార్‌సీపీ చేపట్టిన యువత పోరు కార్యక్రమం జీవీఎంసీ 35వ వార్డులో వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ర్యాలీగా కలెక్టర్‌ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ అదివిష్ణు, సౌత్‌ క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు సువార్త రాజు, పబ్లిక్‌ వింగ్‌ అధ్యక్షుడు బీరు రాజు, సుధ, నౌషద్‌, కర్రి రాము, గంగాధర్‌, బుజ్జి, నాగిరెడ్డి, రమణమ్మ, వినోద్‌, నగేష్‌, సూరీడమ్మ, మల్లిబాబు, తాతారావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులుల తదితరులు పాల్గొన్నారు.



యువత పోరులో పాల్గొన్న డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌, పార్టీ నాయకులు

రెల్లి వర్గానికి న్యాయం చేయాలి

దాబాగార్డెన్స్‌: ఎస్సీ వర్గీకరణతో రెల్లి వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్‌ రెల్లి కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొట్టాన రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్‌ చేశారు. వీజేఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనే వర్గీకరణలో అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెల్లి వర్గానికి కేవలం 1 శాతం రిజర్వేషన్‌ కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సురుపల్లి మోహన్‌కుమార్‌, ఆకుల చందు, కొప్పల అప్పారావు, లోకొండ అప్పారావు, పిన్నింటి రాజు, మజ్జి రాజు, బొమ్మాలి ఆనంద్‌, పిన్నింటి సురేష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ల్యాబ్‌ టెక్నీషియన్లు

• మార్చి 13 ల్యాబ్‌ టెక్నీషియన్స్‌ డే



పరీక్షల నిర్వహణకు సిద్ధమవుతున్న ల్యాబ్‌ టెక్నీషియన్లు

మహారాణిపేట: వైద్య రంగంలో డయాగ్నోస్టిక్‌ సేవలు కీలకమైనవి. రోగాన్ని నిర్ధారించడంలో ఈ సేవల అవసరం ఉంది. ల్యాబ్‌ పరీక్ష ఫలితం బట్టి వైద్యులు చికిత్సలు అందిస్తారు. ఈ విభాగంలో ప్రధాన పాత్ర పోషించే ల్యాబ్‌ టెక్నీషియన్ల సేవలు వెలకట్టలేనివి. అలాంటి ల్యాబ్‌ టెక్నీషియన్లు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రజారోగ్యంలో కీలకంగా ఉండే ల్యాబ్‌ టెక్నీషియన్లు అదే పోస్టులో రిటైర్‌ అవుతున్నారు. వారికి సరైన ప్రమోషన్‌ చానల్‌ ఇవ్వాలని, జోనల్‌ క్యాడర్‌గా మార్పు చేయాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండో ల్యాబ్‌ టెక్నీషియన్‌ పోస్టు మంజూరు చేయాలని ఎంతో కాలంగా డిమాండ్‌ చేస్తున్నారు. కాని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది వారి పరిస్థితి. కాంట్రాక్ట్‌ లేబ్‌ టెక్నీషియన్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్‌ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొనసాగించాలని ల్యాబ్‌ టెక్నీషియన్లు కోరుతున్నారు. అన్ని ప్రభుత్వ ల్యాబుల్లో 63 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కేజీహెచ్‌, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ ఒక్క ల్యాబ్‌ టెక్నీషియనే నిర్వహించడం కష్టంగా ఉందని, రెండో టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అంధకారంలో ఆంధ్రప్రదేశ్‌

దాబాగార్డెన్స్‌: వెన్నుపోటు చంద్రబాబు, రాజకీయ వికలాంగుడు పవన్‌ కల్యాణ్‌ పిచ్చి చేష్టలకు ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ ఆరోపించారు. 29వ వార్డు జగదాంబ జంక్షన్‌ వద్ద గల మహానేత వైఎస్సార్‌ విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వాసుపల్లితో పాటు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్‌, ద్రోణంరాజు శ్రీవత్సవ్‌, జాన్‌వెస్లీ, కొండా రాజీవ్‌గాంధీ పలువురు నాయకులు మహానేత విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వార్డు నాయకుడు పీతల వాసు ఆధ్వర్యంలో కేక్‌ కటింగ్‌, నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ 15 ఏళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. యువత పోరు కార్యక్రమం అన్ని జిల్లాల హెడ్‌ క్వార్టర్స్‌లో విజయవంతంగా జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నియోజకవర్గ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళలు పెద్ద ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహానేతకు నివాళులర్పిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్‌ తదితరులు

రానున్నది జగనన్న ప్రభుత్వమే..

జగదాంబ: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం జీవీఎంసీ 35వ వార్డులో వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత నేత వై.ఎస్‌. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతనరం కనకరెడ్డి మాట్లాడుతూ రానున్నది జగనన్న ప్రభుత్వమే అన్నారు. కార్యకర్తలు కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ అదివిష్ణు, సౌత్‌ క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు సువార్త రాజు, పబ్లిక్‌ వింగ్‌ అధ్యక్షుడు బీరు రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసుపల్లి, తైనాల, జాన్‌వెస్లీ తదితరులు

33వ వార్డులో..

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు పరిధి కుమ్మరవీధిలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్డు నాయకుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో పతావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా లేకున్నా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా కార్యకర్తలు ఉంటారన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పీవీ నరసింహారెడ్డి, పి.ధర్మారావు, సీహెచ్‌ తరుణ్‌, పాల దామోదరరెడ్డి, మజ్జి ఎల్లారెడ్డి, సాయి, వేగి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొని జై జగన్‌.. జైజై జగనన్నా అంటూ నినదించారు.



గాజుల వీధిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తున్న కనకరెడ్డి తదితరులు



33వ వార్డులో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పచ్చిరిపల్లి రాము

26న దేశ రాజధాని ఢిల్లీలో 'ధూం దాం'

దాబాగార్డెన్స్‌: కరెన్సీ నోట్లపై బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ ఫొటో ముద్రించాలంటూ ఈ నెల 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న 'ధూం దాం 'కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని అంబేడ్కర్‌ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యుడు డాక్టర్‌ జెర్రిపోతుల పరశురామ్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వీజేఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్‌ లక్ష్య సాధనకు సంపూర్ణ మద్దతునిస్తూ రాజ్యసభ, పార్లమెంట్‌ సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులు పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. 1921లో ఇంపీరియల్‌ బ్యాంక్‌ కుప్పకూలినప్పుడు 'రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం'అనే పుస్తకాన్ని రాసి హిల్టాన్‌ యంగ్‌ కమిషన్‌, రాయల్‌ కమిషన్‌, బ్రిటీష్‌ ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల 1927లో ఏర్పడిన సైమన్‌ కమిషన్‌ ఇది వాస్తవమని గ్రహించిందన్నారు. 1935 ఏప్రిల్‌ 1న రిజర్వ్‌బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఏర్పడిందంటే అది అంబేడ్కర్‌ కృషి వల్లనే అన్నారు. అంబేడ్కర్‌ లేకుంటే రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా లేదని, ఆ మహనీయుని ఫొటో కరెన్సీ నోట్లపై ముద్రించడం లేదంటే బాబా సాహెబ్‌ను విస్మరించడమేనని అన్నారు. కార్యక్రమంలో పలువురు అంబేడ్కరీయులు పాల్గొన్నారు.




పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న డాక్టర్‌ పరశురామ్‌, పార్టీ నేతలు

కుటుంబం చెంతకు అభాగ్యుడు

సీతమ్మధార: తమిళనాడులోని తంజావూర్‌ జిల్లా వాలంగిమన్‌కు చెందిన సెంథిల్‌ కుమార్‌ ముంబయిలో బ్యాంకింగ్‌ రంగంలో పని చేసేవాడు. కుటుంబ కలహాలతో భార్యతో విడాకులైంది. దీంతో మానసికంగా కుంగిపోయాడు. అతనికి ఇంటర్‌ చదువుతున్న కుమార్తె ఉంది. ఏయూటీడీ సిబ్బంది అతన్ని వైజాగ్‌లో 2024 సెప్టెంబర్‌లో గుర్తించి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. చికిత్స తర్వాత కోలుకున్నాడు. 7 నెలల తర్వాత అతని సమాచారం తెలుసుకుని వచ్చిన కుటుంబ సభ్యులు తల్లి, తమ్ముడు బుధవారం అతన్ని చూసి ఆనందించారు. శ్రద్ధా, ఏయూటీడీ సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు..

సీతమ్మధార: అల్లిపురంలో ఒంటరిగా తిరుగుతూ ఏయూటీడీ షెల్టర్‌ హోంలో చేర్పిన వృద్ధురాలు షకీలా బేగంకు కుటుంబ సభ్యులు ఉన్న విషయం తెలుసుకున్న షెల్టర్‌ నిర్వాహకులు వారిని రప్పించారు. వారు బుధవారం రావడంతో బేగంను కుటుంబ సభ్యులతో పంపించేసినట్లు షెల్టర్‌ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్‌ జ్యోతిర్మయి తెలిపారు.



సెంథిల్‌కుమార్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యులు

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

అల్లిపురం: రైల్వే క్వార్టర్స్‌లో గల ప్రభుత్వ హైస్కూల్‌ పదవ తరగతి విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ నుంచి పబ్లిక్‌ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు స్కూల్‌ 1971,72,73 బ్యాచ్‌ విద్యార్థులు పరీక్షలకు అవసరమైన ఎగ్జామ్‌ ప్యాడ్‌, పెన్‌, పెన్సిల్‌, రబ్బర్‌, స్కేల్‌, జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దత్తి ప్రసాదరావు, పీఎస్‌ఎన్‌ రవి తెలిపారు. మరో పూర్వ విద్యార్థిని డాక్టర్‌ రమామణి మాట్లాడుతూ పదిలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి స్కాలర్‌ షిప్‌ ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజశేఖర్‌, ఎన్‌సీసీ మాస్టర్‌ ప్రసన్నకుమార్‌, విద్యార్థులు ఎల్‌.ప్రసాదరావు, కాకర శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రస్తుత విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

వినియోగదారుల హక్కులపై అవగాహన

దాబాగార్డెన్స్‌: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం, కన్స్యూమర్‌ క్లబ్‌ సంయుక్తంగా ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఆర్‌. మంజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ విశ్రాంత వైస్‌ చాన్సలర్‌ ఆచార్య వి. బాలమోహన్‌ దాస్‌ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వినియోగదారుల హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. రిటైర్డ్‌ డీఎంహెచ్‌వో, విశాఖ కన్స్యూమర్‌ కౌన్సిల్‌ సెక్రటరీ డాక్టర్‌ పి. రామారావు, వైస్‌ ప్రిన్సిపాల్‌ వై. లక్ష్మి, కన్స్యూమర్‌ క్లబ్‌ కన్వీనర్‌ ఎస్‌. నిర్మలాకుమారి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు అనురాధ, డాక్టర్‌ నాగకాంతి, విద్యార్థినులు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమాల జయప్రదానికి పిలుపు

దాబాగార్డెన్స్‌: స్టీల్‌ప్లాంట్‌ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలంటూ ఈ నెల 14న జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిటు విశాఖ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్ట్‌ కార్మికుల తొలగింపులు ఆపాలనే డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసన 14న జరుగుతుందని, దానిని విజయవంతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. పిలుపులో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద, గాజువాక జంక్షన్‌లో ఆ రోజు ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కమిటీ నిర్ణయించిందన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమల గేట్ల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లో నిరసనలు తెలపాలని పేర్కొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్‌ విశేష పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్‌ పార్వతి

అల్లిపురం: కుమ్మరవీధి సచివాలయం పరిధిలో బుధవారం చిన్నారులకు పోలియో, హెపటైటిస్‌ బి, కోరింత దగ్గు, తట్టు తదితర వ్యాధుల నివారణకు టీకాలు వేశారు. బాలింతలు, గర్భిణులకు నెలవారీ తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్‌ పి.పార్వతి పాల్గొన్నారు.

చురుగ్గా ఎన్‌సీడీ సర్వే..

కుమ్మరవీధి సచివాలయం ఆధ్వర్యంలో నాన్‌ కమ్యూనికేషన్‌ డిసీజ్‌ సర్వైలెన్స్‌, మానిటరింగ్‌ అండ్‌ రిపోర్టింగ్‌ (ఎన్‌సీడీ) సర్వే చేపట్టారు. ఈ సర్వే ద్వారా వంశపారంపర్యంగా కుటుంబంలో సక్రమించే వ్యాధులు తదితర వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్‌ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

'పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉందాం'



డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న స్టేట్‌ కన్సల్టెంట్‌ శివశంకర్‌



నక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉందాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలు, వర్తకులకు పిలుపునిచ్చారు. సిగరెట్‌ అండ్‌ అదర్‌ టూబాకో ప్రొడక్ట్స్‌(సీవోటీపీఏ) సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం, 2003 అమలు, ఆవశ్యకత, ఇతర అంశాలపై అవగాహన కల్పించే నిమిత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డ్రైవ్‌ పేరుతో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టేట్‌ కన్సల్టెంట్‌ శివశంకర్‌ ఆధ్వర్యంలో సత్యం జంక్షన్‌ వద్ద పలు పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులను పరిశీలించి, కొన్ని దుకాణాలకు జరిమానాలు విధించారు. సీవోటీపీఏ చట్టం ఆవశ్యకత, అందులో పేర్కొన్న నిబంధనల గురించి ప్రజలు, వర్తకులకు వివరించారు. విద్యా సంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదనే అంశాన్ని నొక్కి చెప్పారు. డ్రైవ్‌ లో భాగంగా నక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి పొగాకు ఉత్పత్తుల వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, పోస్టర్లు ప్రదర్శించారు. అంతకు ముందు రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్‌ కన్సల్టెంట్‌ శివశంకర్‌, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ హారిక, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

మహారాణిపేట: విశాఖపట్నం పోర్ట్‌ అథారిటీ (వీపీఏ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం పోర్ట్‌ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోర్టు చైర్మన్‌ డాక్టర్‌ ఎం. అంగముత్తు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్ట్‌ మహిళా విభాగం చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న సీనియర్‌ మహిళా ఉద్యోగులను చైర్‌పర్సన్‌ తదితరులు సన్మానించారు. 'ఐగాట్‌ కర్మయోగి'కోర్సు పూర్తి చేసిన మహిళా ఉద్యోగులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్‌ వందన సమర్పణ చేశారు. అనకాపల్లి కలెక్టర్‌ విజయకృష్ణన్‌, విశాఖ జిల్లా కలెక్టర్‌ సతీమణి దివ్యా హరేందిరప్రసాద్‌ (న్యాయవాది), డిప్యూటీ చైర్మన్‌ దుర్గేష్‌ కుమార్‌ దూబే, చీఫ్‌ విజిలెన్సు ఆఫీసర్‌ పీఏస్‌ఎల్‌ స్వామి, పోర్ట్‌ విభాగాధిపతులు, మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి కలెక్టర్‌ విజయకృష్ణన్‌ తదితరులు

దర్శకుడు గీతాకృష్ణపై మహిళా న్యాయవాదుల ఫిర్యాదు

విశాఖ లీగల్‌: అశ్లీల పదాలు, జుగుప్స కలిగించే విమర్శలతో పలువురు నటీమణులను కించపరిచే విధంగా యూట్యూబ్‌లోనూ, పలు చానెళ్లల్లో పోస్టింగులు పెడుతున్న చిత్రదర్శకుడు ఎ.ఎస్‌.గీతాకృష్ణపై విమెన్‌ అడ్వకేట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ (వావా) నగర పోలీస్‌ కమిషనర్‌ శంఖబ్రత బాగ్చికి బుధవారం ఫిర్యాదు చేసింది. వావా అధ్యక్షురాలు సీనియర్‌ న్యాయవాది అనురాధ పప్పు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కయ్యపాలెంలో గీతాకృష్ణ ఫిల్మ్‌ స్కూల్‌, హైదరాబాద్‌ మాదాపూర్‌లో ఫిల్మ్‌ ఇనిస్టిట్యూట్‌ను దర్శకుడు గీతాకృష్ణ నడుపుతున్నాడని తెలిపారు. గీతాకృష్ణ చిత్ర దర్శకుడిగా అనేక తెలుగు, తమిళ చిత్రాలకు పనిచేసిన విషయం తెలిసిందే. ఉత్తమ దర్శకుడిగా అవార్డు కూడా గతంలో పొందారన్నారు. ఇటీవల కాలంలో గీతాకృష్ణ అనేక చానళ్లలో పలువురు సినిమా నటులను, ముఖ్యంగా మహిళా నటీమణులను చాలా అసభ్యంగా విమర్శిస్తున్నారని వావా అధ్యక్షురాలు అనురాధ, సీనియర్‌ న్యాయవాదులు కె.ఎల్‌.డి.నాగశ్రీ, పి.పద్మాభాయి, బి.సుకన్య, కరణం కళావతి, బి.రమాదేవి పోలీస్‌ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కమిషనర్‌ ప్రాథమిక విచారణకు ఆదేశించారు.



న్యాయవాదుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న నగర పోలీస్‌ కమిషనర్‌ శంఖబ్రత బాగ్చి